# అమెరికా

కూనపురి వేంకటచలపతి శర్మ, Flushing, NY

జంఘాలశాస్త్రి ఉపన్యసిస్తున్నాడు. ఓం శాంతిః శాంతిః శాంతిః. సోదరీ సోదరులారా! మనమిప్పుడు ఎక్కడున్నాము? మనమున్న దేశము పేరేమిటి? 'అమెరికా' ఎవరో కేకశారు. ఆహా! ఏమి యీ పేరు! ఎంత సుందరమైన పేరు! మళ్ళీ మళ్ళీ అనండి. అందరూ కలసి అనండి. ఎన్నిసార్లు విన్నా వినాలనిపించే పేరు. దేశం పేరులోనే యింత సొగసు గుబాళిస్తే, దేశంలో ఎంత సొగసుందో! అయ్యా, నిజంగా యీ దేశం పేరును గురించి చెప్పాలంటే చాలా వుంది. 'చెప్పేదేదో త్వరగా చెప్పవయ్యా' ఇంకొకరి కేక. 'అయ్యా! అంత తొందరెందుకు? నిదానమే ప్రధానము. శ్రద్ధగా వినండి. అసలు ఈ దేశముపేరు 'అమరదేశము'. అమరదేశమే వాడుకపరంగా మార్పుచెంది 'అమెరికా' అయింది. అమరులు అంటే దేవతలు. దేవతలుండే లోకం స్వర్గం. అందుచేత యీ దేశం స్వర్గలోకమే. ఇప్పుడు తెలిసిందా! మనమెక్కడున్నామో! 'చాల్లేవయ్యా, నీ అతి తెలివితేటలు' మరొకరికేక. 'అయ్యా, నావి అతి తెలివితేటలు కావు. భారతదేశంలో 'కాశీ' నగరం తెలుసుకదా. ఆనగరం పేరు వారణాసి. కానీ, వాడుకలో అది 'బెనారస్' అయింది. ఇప్పుడు మళ్ళీ 'వారణాసి' అని తప్పు దిద్దుకున్నాము. ఇంకా వినండి. 'బెజవాడ' తెలుసుకదా! అసలు పేరు 'విజయవాడ'. వాడుకలో 'బెజవాడ' అయింది. మళ్ళీ 'విజయవాడ' అంటున్నాము. మా నాయనమమ్మ 'ప్యాంటు'ను(pant) పంట్లాము అనేది. మా తాత 'మెట్రిక్యులేషన్'ని(Matriculation) 'మిట్లేషను' అనేవాడు. ఇలా చాలా చెప్పుకోవచ్చు. ఇప్పుడేమంటారు. నాకు తెలివితేటలు చాలా తక్కువ. 'OK, go ahead' మరో కేక. 'అయ్యా యీదేశం పేరుకు ఆధ్యాత్మికపరంగా చాలా ప్రాముఖ్యత వుంది. వినండి. సకల ప్రపంచానికీ, వేదములకు 'ఓం'కారము మూలము. 'ఓం'కారము పరబ్రహ్మ స్వరూపము. కృష్ణ యజుర్వేదంలోని తైత్తిరీయ ఉపనిషత్తులలో 'ఓం'కారమును గూర్చిన ప్రశస్తి చాలా విశదముగానున్నది. (ఓం ఇతి బ్రహ్మ. ఓ ఇతి ఇద్ గం సర్వం). ఆహా! ఏమి ఈ 'ఓం'కార ప్రశస్తి! 'అసలు విషయానికి రావయ్యా' ఎవరో అరుస్తున్నారు. 'అసలు విషయమే చెబుతున్నాను. 'ఓం' కారము ఒకటే అక్షరమనిపించినా, అందులో మూడు అక్షరాలున్నాయి. 'అ'కార, 'ఉ'కార, 'మ'కార సమ్మేళనమే 'ఓం'కారము. ఏకత్వంలో అనేకత్వం ఉంది. ఇక వినండి. 'ఓం'కారములోని మూడు అక్షరాలలో, రెండు అక్షరాలు, అంటే 'అ' 'మ'లు యీదేశం పేరులోని మొదటి రెండు అక్షరాలుగా నిలిచాయి. 'అ' 'మె'రికా. ఇప్పుడు తెలిసిందా! ఓంకారానికున్న ప్రశస్తి, యీ దేశం పేరులోనే వుంది.'

'అబ్బ, ఏం సుత్తి కొట్టావయ్యా,' ఎవరో కుర్రకారు గొణిగారు.

'ఏమంటున్నారు? ఆపమంటున్నారా, అట్లాగే, ఓం శాం...'

'నీకు చెముడు కూడానా, పూర్తిగా చెప్పవయ్యా' బిగ్గరగా అరుపులు.

'అయ్యా నాకు చెముడులేదు వినండి. ఈ దేశం పేరు స్వర్గం పేరును సూచిస్తుంటే, దేశం లోపల స్వర్గంలాగానే వుంది. స్వర్గలోకంలో వుండే విషయాలు వినండి. అక్కడ ఏవస్తువుకా కొఱత వుండదు. ఇక్కడా అంతే. స్వర్గం భోగభూమి. ఇదీ అంతే.'

'శాస్త్రీ! యీ దేశంలో వుండే కష్టాలు నీకు తెలిసినట్లు లేవు' ఒక కేక.

'అయ్యా నాకు తెలుసు. ఇక్కడ స్వర్గసుఖాలను చెబుతున్నాను. కష్టాలు లేవని చెప్పలేదు. అయినా ఒక్క విషయం. నేను చాలా మందిని అడిగాను, ఇక్కడ ఎన్నాళ్ళనించి ఉంటున్నారని. దాదాపుగా అందరూ చెప్పారు. 15, 20సంవత్సరాల నుంచీ ఉంటున్నామని. మరి ఇన్ని కష్టాలనుభవిస్తూనే, వుంటున్నారు. అంటే యీ కష్టాలు సుఖానుభూతులేమో! మీరే చెప్పండి. అంతే కాక స్వర్గంలో కష్టాలు లేవని నేను చెప్పలేదు కదా.'

'స్వర్గంలో విషయాలు చూసొచ్చినట్లు చెబుతున్నావే' ఎవరిదో కేక

'అవును, నేను స్వర్గం నుండే వచ్చాను. నేనిప్పటివాడను కాను. పీఠికాపుర (పిఠాపురం) మహారాజావారు జీవించినకాలంలో, నేను చేసిన మంచి పనుల ఫలితంగా, నా మరణానంతరం నేను స్వర్గానికి వెళ్ళాను. నేన స్వర్గానికి వెళ్ళేటప్పటికి, అక్కడ పద్ధతులు చాలా అధ్వాన్నంగా వున్నాయి ఆరోజుల్లో పాపం చేసేవాళ్ళు చాలా తక్కువ. ఇప్పటి దారుణ పరిస్థితులు ఆ నాడు లేవు. అన్ని దేశాలలోనూ మంచివారే ఎక్కువ కనుకనే, రెండువందల సంవత్సరాలకు పూర్వం నుండే, పుణ్యం చేసినవారూ, మంచివారు, మరణానంతరం స్వర్గానికి రావటంవల్ల , స్వర్గం అంతా కూడా, చాలా యిరుకుగా తయారయింది. వీరందరికీ వసతి చూపించటం, ఇంద్రుడికి శిరో భారమయింది. తన అంతరంగికులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశాడు. కొన్ని సూచనలు వచ్చాయి పూర్వం విశ్వామిత్రుడు, త్రిశంకునికోసం మరో స్వర్గాన్ని సృష్టించాడు. అదే విధంగా యింకో స్వర్గాన్ని సృష్టిస్తే ఎలాగుంటుంది? బాగానే వుంది, కాని అధిపత్యం తాలూకు సమస్యలు తలెత్తుతాయి. అందుకని యింకో స్వర్గం సృష్టించేకంటే, భూలోకంలోనే ఏదో ఒక దేశాన్ని స్వర్గంగా పరిగణిస్తే బాగుంటుందని నిర్ణయం చేశారు. భూలోకం అంతా ఒకసారి పరికించారు విశాలమైన భూభాగం యిక్కడ కనుపించింది. ఆహా! ఏమి యీ దేశం అదృష్టం. ఈ దేశానికి 'అమర' దేశం అని ఇంద్రుడే నామకరణం చేశాడు. వాడుకచేత భాషలోని పదాలు, అరిగిపోతాయి, తరిగిపోతాయి పూర్తిగా అదృశ్యమైపోతాయి. ఇప్పుడు తెలిసిందా? ఈ దేశం పేరుకు వున్న పూర్వ చరిత్ర! తరవాత వినండి. జనసమ్మర్దంగావున్న స్వర్గంలోనుంచి కొంతమందిని యీదేశానికి పంపడానికి యింద్రుడు ప్రయత్నంచేశాడు. కాని అక్కడవారు ఒప్పుకోలేదు. నిరాహార దీక్ష చేస్తామన్నారు. ఆ సమయంలోనే నేను స్వర్గానికి వెళ్ళటం తటస్థించింది. బృహస్పతులవారి మధ్యవర్తిత్వం ఫలితంగా ఒక ఒప్పందం కుదిరింది. సంవత్సరానికి 'యింతమంది చొప్పున స్వర్గంనుంచి యీ దేశానికి పంపిస్తున్నారు. ఈ పద్ధతే, కొన్ని మార్పులతో 'IMMIGRATION'గా యిక్కడ అమలు జరుపబడుతోంది. ఈ మధ్యనే బృహస్పతులవారు ఒక క్రొత్త ఉపాయం కనిపెట్టారు. మరణానంతరం స్వర్గానికి వచ్చి, తరవాత వంతులవారీ అమెరికా వచ్చే బదులు, పుణ్యం చేసినవారు, ప్రతి దేశం నుండీ , దేహంతోనే అమెరికా వెళ్ళవచ్చు. ఆ విధంగా కొత్తగా స్వర్గానికి వచ్చేవారిసంఖ్య తగ్గుతుంది. అందువల్లనే ప్రతి దేశంనుండి గత కొద్ది సంవత్సరాలుగా, విరగబడిన పుణ్యాత్ములు అమెరిగా వస్తున్నారు. అందుకనే, అమెరికా వెళ్ళేవారిని 'ఎంత పుణ్యం చేసుకునారయ్యా' అని అంటున్నారు. ఇక నా సంగతి వినండి. ఈ సంవత్సరం నుండి యీ దేశానికి పంపబడేవారి పట్టికలో నా పేరు వున్నది. అందుకే నేనిక్కడకు వచ్చాను. స్వర్గంలో వుండే కష్టాలు కూడా చెబుతాను వినండి

ప్రస్తుతం స్వర్గంలో వారికి తిండి లేదు. ఎందుకని! భూలోకంలో మానవులు యజ్ఞ యాగాదులు, దాన ధర్మాలు వగైరా చేయటం వల్లనే స్వర్గంలో వారికి యింతవరకూ పబ్బం గడిచింది. కాని, మీకు తెలుస గదా! భారత దేశంలో ఆధ్యాత్మికచింతన తగ్గింది. పూజలు తగ్గాయి. ధర్మ కర్మాచరణ తగ్గింది. తత్ఫలితంగా స్వర్గవాసులకు పిట్టంగట్టింది.

ఎవరో అరుస్తున్నారు. 'ఈ దేశంలో ఇప్పుడు దేవాలయాలు కట్టారు అన్ని రకాల పూజలు చేస్తున్నారు. ఇక్కడ వేదాలు కూడా నేర్పుతున్నారు యివి స్వర్గంలోవారికి ఉపయోగపడటం లేదా?'

జంఘాల శాస్త్రి చెబుతున్నాడు. 'అయ్యా, యీ విషయాలు స్వర్గంలో వారికి తెలుసు. కాని యిది కర్మ భూమి కాదట. ఇది కూడా అపర స్వర్గమే కదా. అందుకని ఈ తిండి వారికి ముట్టడం లేదు. ఈ భూమిని కర్మ భూమిగా మార్చి, యిక్కడినుంచైనా స్వర్గలోక వాసులకు తిండి సంపాదిద్దామని యింద్రుడు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాడు. ఈ దేశప అధ్యక్షునితో మంతనాలు జరుపటానికి తహతహలాడుతున్నాడు.

అయ్యా! ఆ మంతనాలు ఫలప్రదం ఆయెనా, ఇక చూడండి. ఈ దేశ పరిస్థితి ఎలా మారుతుందో! ఇక, యిక్కడ యజ్ఞ యాగాదులు, హోమాలు, తపస్సులు, దానధర్మాలు ఆచరింప బడతాయి. ఆహో, కృత త్రేతా యుగా కాలాన్ని మీరందరు చూడవచ్చు. అంతే కాదు. ఏ దేశానికయినా స్త్రీల సౌభాగ్యమే దేశసౌభాగ్యము. ఇక చూడండి, ఈ దేశంలో యిప్పుడున్న స్త్రీలలో మార్పు వస్తుంది. వీరి ఆచార వ్యవహారాల్లో, కట్టుబొట్టులలో కనీవినీ ఎరుగని మార్పు వస్తుంది.

కత్తెర జుట్లు పోతాయి. ఉంగరాల జుట్లు పోతాయి. వాలు జడలు వస్తాయి. చుట్టముడులొస్తాయి. పాపిడి జుట్టులొస్తాయి. సోమిదేవి కొప్పు లొస్తాయి. మగవారు ధరించే కంఠకాపీనాలను (necktie) యిక ఆడవారు విసర్జిస్తారు.. యీ స్త్రీల చేతులనిండా గాజులు, ఒడ్డాణములు, వంకీలు, పాపిడి బిళ్ళలు, జడ కుప్పెలు, కాళ్ళకు కడియాలు, ఒకటేమిటి, సత్యభామాదేవికి వున్నన్ని ఆభరణాలు ధరిస్తారు. లంగా ధారిణులు, పట్టుచీర పడుచువారు, నేత చీరల నాయనమ్మలు, ఇటువంటి స్త్రీలతో, యీ దేశం కళకళలాడుతుంది. అయ్యా, ప్రపంచ దేశ స్త్రీలలో, భారత స్త్రీలు జాతి రత్నములు, ఆణి ముత్యములు, వజ్ర ప్రతునకలు. మన స్త్రీ లందరు శ్రావణ మాసంలో మంగళగౌరి వ్రతాలు, వరలక్ష్మీ వ్రతాలు, నోములు, ఉద్యాపనలు చేస్తారు. సంక్రాంతికి సందె గొబ్బిళ్ళు, ఇంటింటికీ తిరిగే పేరంటాలు, శనగల వాయినాలు, భోగిమంటల మహోత్సవాలు, ఎన్నెన్నో. ముత్తైదువులు పేరంటానికి వీధులలో నడుస్తూ వెడుతున్నప్పుడు, వారు కట్టుకున్న పట్టు చీరల కుచ్చెళ్ళు చేసే సవ్వడి ముందు, శాస్త్రీయ సంగీతపు రాగాలలోని సరిగమలు మూగపోతాయి. సంగీత కళాకారుల గాత్రాలు బొంగురుపోతాయి. యీ స్త్రీల ముఖ కాంతి ముందు సూర్యుని వెలుగు మసకపారుతుంది. చంద్రుడు చిన్నబోతాడు.' ఎవరో అంటున్నారు 'శాస్త్రీ, నీ ఊహాగానం అద్భుతం.' జంఘాల శాస్త్రి అంటున్నాడు. ' అయ్యా, నావి ఊహలు కావు. ఒక సంఘటన జరిగింది. అది విన్న తరువాత నా ఊహ సరైనదో కాదో చెప్పండి.

ఈ మధ్య న్యూ జెర్సీ లో ఒక యింటికి నేను పెళ్ళిపెద్దగా వెళ్ళాను. నాతో కలుపుకుని, అక్కడ వున్నవారు ఆరుగురు. పెళ్ళికూతురు, పెళ్ళి కొడుకు, ఆయింట్లోని దంపతులు, పురోహితుడు, నేను. పెళ్ళికొడుకు పదహారణాల తెలుగువాడు. పెళ్ళికూతురు ఆస్ట్రేలియా కన్నెపిల్ల. కాకి ముక్కుకు దొండపండులాంటి జంట. వివాహం శాస్త్రోక్తంగా జరిగింది. ఆ పిల్ల నాలుగు గంటలసేపు వివాహతంతులో భాగం పంచుకుంది. పురోహితుని గుక్కతిప్పు పరుగు మంత్రాలకు ఆమె కళ్ళెంపట్టి లాగుతోంది. ఆమె శరీరము మేలిమి బంగరు వన్నె. నుదుట కల్యాణ తిలకము. కళ్ళకు కాటుక, చేతులకు గాజులు, బుగ్గన చుక్క. కాళ్ళకు పసుపు పారాణి. పసుపు కొమ్ముతో మాంగల్యము. ఆమె నాకు నమస్కారం చేయటానికి చేతులు చాపినప్పుడు, కుంకుమ లేని నా నుదురు, ఆమె చేతి కాంతిలో ప్రతిబింబించింది. అయ్యా, ఆమె ప్రౌఢ సరస్వతీ దేవి. ఆమె యందు, నాకు పుత్రికా భావము స్ఫురించి, నా మనస్సు కలత చెందింది. ఇక మనవాడు ఎలా వున్నాడు? బక్క చిక్కిన గేడి రూపము. వికారంగా లేకపోయినా, అందగాడు మాత్రం కాదు. వీరి దాంపత్యం ఎంత కాలం నిలుస్తుంది? అన్న ఆలోచనకు ఆ అమ్మాయి పలకరింపు అడ్డం కొట్టింది. ఉన్న నలుగురూ తిండికోసం వేటాడుతుంటే, యీ పిల్ల నాకు పాదాభివందనం చేసి ' బాబాయిగారూ, ఆశీర్వదించండి.' అని అన్నది. 'లక్ష్మీనారాయణ ఇవ, అన్యోన్న అనురాగ దంపతీ యుక్తా భవ.' అని ఆశీర్వచనం మనసారా చేశాను. సమయం దొరికింది కదా అని, ఆ అమ్మాయితో 'అమ్మా నేనొక విషయం అడగొచ్చా' అన్నాను.

'బాబాయిగారు, తప్పకుండా అడగండి.' అని అన్నది.

'ఏమి చూసి యీ అర్భకుడుని కట్టుకొన్నావమ్మా?'

ఆ అమ్మాయి చెబుతోంది. 'బాబాయిగారూ, మీరు పెద్దవారు. నేను చెప్పదగ్గదానిని కాను. మీకు తెలిసిన విషయమే కదా!'

'ఆహార, నిద్రా, భయ, మైధునాచ
సామాన్య మేతత్ పశుభిః నరాణాం'

దీని అర్థం మీకు తెలియనిది కాదు కదా! తిండి, నిద్ర. భయం సంసార సుఖ వాంఛ యీ నాలుగు జంతువులకి మానవులకు సమానమే, కానీ సంసార సుఖానికి బాహ్య సౌందర్యము ప్రధానం కాదు బాబాయిగారూ, మేమిద్దరమూ ఆస్ట్రేలియాలో వైద్య కళాశాలలో సహాధ్యాయులము (classmates). నా భర్త కంటే ధనవంతులు, అందగాళ్ళు అన్ని విషయాల్లోను ఆరి తేరినవారు చాలా మంది వున్నారు. కాని నా భర్త మేధా సంపన్నుడు. ఆంతరంగిక సౌందర్యవంతుడు, సద్గుణరాశి ఈయనలోని జాలి, కరుణ, పరోపకార బుద్ధి, మొదలగు ఆత్మ గుణాల చాలా మందిలో లేవు. పేదవారికి సేవ చేసే స్వభావం, తను వైద్య విద్యనభ్యసిస్తూనే యితరులకు ఉచిత వైద్య సేవ చేస్తున్న వైనం అధ్యాపక బృందానికే ఆదర్శవంత మయినది. అందుకనే, యీయన గుణగణాలన నేను పరిగణలోకి తీసుకున్నాను. ఈయన సహచర్యంలో పదిమందికి వైద్య సేవ చేసి జీవితం సార్థకం చేసుకోవాలన్నదే నా ధ్యేయం. బాబాయిగారూ యీయన నన్ను శల్య పరీక్ష చేశారు. వివాహం అయిన తరువాత ఏ కారణం చేతనయినా నేను యీయనను విడిచిపెడతానేమోనని. నేన ఆయన ముందు ప్రమాణం చేశాను. ఆయన నన్ను వివాహం చేసుకోకపోతే నేను ఆజన్మాంతం అవివాహితగానే వుంటాను. కాని ఆయనను ఒక కోరిక కోరాను. సహధర్మచారిణిగా నన్ను ఒప్పుకోకపోతే, ఆయన ఆశయ సాధనలో సహచారిణిగా నయినా పాలు పంచుకోనిమ్మని. భగవంతుని అనుగ్రహంవల్ల ఆయన నన్ను అనుగ్రహించారు. మా దాంపత్యం కలకాలం నిలవాలని మీరు ఆశీర్వదించండి' అని మళ్ళీ నాకు పాదాభివందనం చేసింది.

నానోట మాట రాలేదు. 'అమ్మా, అమ్మా' అని మాత్రమే అనగలిగాను. నాకళ్ళు చెమ్మగిల్లాయి.

'అయ్యా, యిప్పుడేమంటారు. భారత స్త్రీల గృహాన్ని మెట్టినింటిని చేసుకొని, మన వారికి తలమానికము కగలిగిన యీ అమ్మాయి సంస్కారము మన భారత స్త్రీల సొత్తు కాదా? ఇప్పుడు చెప్పండి. నావి కేవలం ఊహలేనా?'

ఇంతలో అత్యవసర వైద్య సహాయశకటం (ambulance) చేసే శబ్దానికి సభలో అంతరాయం కలిగింది.

నాకు మెలకువ వచ్చింది.

నా మంచం ప్రక్కన వున్న గడియారంలో గణగణ శబ్దం వినిపిస్తోంది ●

## ఈ వసంతమాసంలో

ప॥ ఈ వసంతమాసంలో ఏ తోటలోనో
కోయంటు పాడేవు ఓ కోయిలా
ఎవరు నేర్పారే చిన్ని కోయిల నీకు
హాయిగా పాడేవు కమ్మనీ రాగం....॥ఈ వసంత॥

చ॥ గుబురు మామిళ్ళు పిందెలేసేను
చిగురు చిగురుకు చిన్ని చిలకలేనమ్మ
ఎగిరి రావే నీవు చిలకల్ని చూడ
మారాము చేయకే నా చిన్నికోయిల....॥ఈ వసంత॥

చ॥ ఎండుకొమ్మలమీద ఎగిరెగిరిపాడేవు
ఎవరు వింటారనే వెర్రికోయిలరాణి
ఎంతకాలము నీవు ఒంటరిగపాడేవు
శృతికలిపి పాడవే చిలకలతోకూడి....॥ఈ వసంత॥

చ॥ నీలినింగి అంచుల్లో తిరిగి తిరిగి అలసినావు
చల్లని మామిళ్ళలోన వదిగి కూర్చోవమ్మా
చిన్నారి చిలకలతో కలిసి గూడుకట్టుకుని
హాయిగా పాడవే అందాలశృతికలిపి....॥ఈ వసంత॥

— నాగలక్ష్మి కొంకపాక
*Schiller Park, IL*